
ఎవర్ 'గ్రీన్' వర్సిటీ

హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ జీవ వైవిధ్యానికి ఆనవాలుగా ఉంది. పురివిప్పిన నెమళ్లు ... జింకలు, దుప్పిల విహారం.. కుందేళ్ల దోబూచులాటలు... పక్షుల కిలకిలారావాలు.. అడవి, ముళ్ల పందుల హంగామా.. నెలకొంది. ఇక ఎటుచూసినా పచ్చదనంతో అలరారుతోంది. నేడు నగరం కాంక్రీట్‌ జంగిల్‌గా మారిన నేపథ్యంలో నగర శివారులోని గచ్చిబౌలి హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ ఆహ్లాదకరంగా ఉంది. భారీ బండరాళ్లు, వృక్ష సంపద, పండ్లు, పూలు, ఔషధ మొక్కలు, పచ్చిక బయళ్లు, నీటి వనరులు, భారీ వృక్షాలు, పురాతన రాతి సంపద ఈ క్యాంపస్‌ ప్రత్యేకం. నగర శివారులో అతిపెద్ద జీవవైవిధ్య కేంద్రంగా హెచ్‌సీయూ గుర్తింపును సొంతం చేసుకుంది. – రాయదుర్గం


హెచ్‌సీయూ క్యాంపస్‌లో పచ్చదనం

జీవ వైవిధ్యం..హెచ్‌సీయూ సొంతం




- పక్షులు, నెమళ్లు, జింకలు, ఇతర జీవాలకు నెలవు
- 50 ఏళ్లుగా కాపాడుతున్న 'పట్టణ అటవీ ప్రాంతం'
- భవిష్యత్‌ తరాలకు ఇది వరం

- జింకలు, దుప్పిలు, నెమళ్లు, అడవి పందులు, ముళ్ల పందులు, కుందేళ్లు, జింకలు, ఎన్నో రక రకాల పక్షులు, కీటకాలు, పాములు , బల్లులు, ఊసరవెల్లులు, తాబేళ్లు, ప్రధానంగా నక్షత్ర తాబేళ్లు.. ఇలా మొత్తం 200 రకాల జాతులు హెచ్‌సీయూ ప్రాంగణంలో ఉన్నాయి.
- క్యాంపస్‌లోని అటవీ ప్రాంతాన్ని అలాగే కొన సాగిస్తూ పక్షులు, జీవాల కోసం ప్రత్యేకంగా 40 వరకు నీటి భారీ టబ్‌లను ఏర్పాటు చేసి వేస విలో వాటి దప్పిక తీరుస్తున్నారు.
- కొన్ని సందర్భాలలో వీటికి ఆహారాన్ని కూడా అందించే ఏర్పాట్లు చేశారు. ఇలా యూని వర్సిటీ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

చేపట్టిన చర్యలు..

- వర్షాకాలంలో హరితహారం కింద ప్రతిఏటా వేలాది మొక్కలు నాటుతున్నారు
- క్యాంపస్‌లో ప్రత్యేకంగా సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలను పెంచుతూ వస్తున్నారు.
- బర్త్‌డే రోజున మొక్కలు నాటేందుకు బర్త్‌డే పార్కును కూడా నిర్వహిస్తున్నారు.
- అటవీ ప్రాంత పరిరక్షణకు ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు
- క్యాంపస్‌లోని పీకాక్‌ లేక్‌, గుండ్లకుంట, చిలకల కుంట, గన్నేరు కుంటలను కాపాడుతున్నారు
- అలాగే పలుచోట్ల రెయిన్‌ వాటర్‌ హార్వెస్టింగ్‌ పిట్స్‌ ఏర్పాటు చేశారు
- క్యాంపస్‌లో ఏటా ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం, హార్టికల్చర్‌ విభాగం, శానిటరీ విభాగం, విద్యార్థి సంఘాలు హరితహారం కింద, రకరకాల పేర్లతో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు
- ప్రత్యేకంగా ఈ ఏడాది ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో 'ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌' పేరిట మొక్కలను నాటే కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్‌ బీజేరావు, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ దేవేష్‌నిగమ్‌ మొక్కలు నాటారు. భవిష్యత్తులో కూడా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఎకరం స్థలంలో స్వచ్ఛంద సంస్థతో కలిసి మియా వాకీ పేరిట చిట్టడవిని పెంచుతున్నారు.





జీవ వైవిధ్య పరిరక్షణకు చర్యలు అవసరం



ప్రతి ఏటా అటవీ ప్రాంతంలో డిసెంబర్‌ నుంచి జూన్‌ వరకు జరిగే అగ్ని ప్రమాదాలను అరికట్టాలి.

- క్యాంపస్‌లో ప్రత్యేకంగా మినీ అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి
- మరిన్ని మియా వాకీ ప్రాజెక్టుల ద్వారా చిట్టడవులను పెంచాలి
- వేసవిలో జంతుజాలానికి ఆహారం, నీటి సౌకర్యాన్ని మరింత పెంచేలా చూడాలి
- క్యాంపస్‌ నలుమూలలా వాచ్‌టవర్లను నిర్మించి, ప్రత్యేక సెక్యూరిటీ గార్డులను నియమించాలి.


హెచ్‌సీయూ క్యాంపస్‌లో చెరువు


హెచ్‌సీయూలో జింకల సందడి


ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌' పేరిట మొక్క నాటిన వీసీ ప్రొ.బీజేరావు

25న ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ప్రత్యేక సెమినార్‌ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 25వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలవరకు ఈ సెమినార్‌ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 'ఇంటిగ్రేషన్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌స్పిరిచ్యువాలిటీ: ది సోర్స్‌ ఆఫ్‌ ఇన్ఫినిటి పాసిబిలిటీస్‌' అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ


దవాఖానాను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రీకాంత్‌

మియాపూర్‌: డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ కాలనీలో బస్తీ దవాఖానాను బుధవారం కార్పొరేటర్‌ శ్రీకాంత్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిస్థితులను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యం తలెత్తిన వెంటనే దగ్గరలో ఉన్నటువంటి బస్తీ దవాఖానాలను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంటీ కాలనీవాసులు దేవేందర్‌రావు, దశరథ్‌రావు, విద్యానందచారి, సురేష్‌, రమేష్‌, రమేష్‌ చంద్ర, నర్సింగ్‌రావు, విరూపాక్షయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరుపత్రం అందజేత


బాధితుడికి మంజూరుపత్రాన్ని అందజేసిన జగదీశ్వర్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ రిక్షాపుల్లర్స్‌ కాలనీకి చెందిన ఎస్‌. శరత్‌ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.75 వేలు మంజూరుపత్రాన్ని శేరిలింగంపల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ బుధవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో వివేకానందనగర్‌ డివిజన్‌ అధ్యక్షులు బాషిపాక యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ గెజిటెడ్‌ హెచ్‌ఎంగా తాజ్‌బాబు



రాయదుర్గం: రాష్ట్రస్థాయి ఉత్తమ గెజిటెడ్‌ హెడ్‌మాస్టర్‌ కేటగిరిలో రాయదుర్గంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌.కే.తాజ్‌బాబును ఎంపిక చేశారు. 2015లో హెచ్‌ఎంగా పదోన్నతి పొంది రాయదుర్గంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఈ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకోవడం, మెరుగైన బోధనతో పదవ తరగతి ఫలితాలను 77 శాతం నుంచి 92 శాతానికి పెంచారు. తాజ్‌బాబు పనితీరు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ గెజిటెడ్‌ హెడ్‌ మాస్టర్‌గా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం , ఉన్నతాధికారులను సంప్రదించడం, బోధన విధానంలో మార్పులు తేవడం, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఈ గుర్తింపు లభించినట్టుగా భావిస్తున్నాని చెప్పారు.

ఎపిస్టెమో స్కూల్‌లో కెరీర్‌ డిజైన్‌ ల్యాబ్‌ ప్రారంభం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఎపిస్టెమో స్కూల్‌ బ్రాంచ్‌లో అత్యాధునిక కెరీర్‌ డిజైన్‌ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. సీనియర్‌ ట్రేడ్‌ అడ్వైజర్‌ పియూష్‌అవస్తీ (టెక్నాలజీ ఎడ్యుకేషన్‌ బ్రిటీష్‌ డిప్యూటీ హై కమిషన్‌, హైదరాబాద్‌) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే నైపుణ్యాలను నేర్చుకోవడానికి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్‌ కొల్లి పద్మ మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యం పెంపుదలకు అవసరమైన సాధనాలు, మార్గదర్శకత్వం, వారి కెరీర్‌ ఆకాంక్షలను అన్వేషించడానికి సాకారం చేసుకోవడానికి అవకాశాలను అందిస్తుందన్నారు. కెరీర్‌ కౌన్సిలర్‌ రజిత మాట్లాడుతూ జీవితంలో అభివృద్ధి అతి ముఖ్యమైనదని వివరించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ వాణిమత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ రవాణా, మనీలాండరింగ్‌ కేసు అంటూ ఫోన్‌ కాల్‌..

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి నుంచి రూ. కోటి 58 లక్షలు కాజేసిన సైబర్‌ నేరగాళ్లు

పటాన్‌చెరు టౌన్‌: మలేషియాకు డ్రగ్స్‌ రవాణా, మనీ లాండరింగ్‌ కేసులో అనుమానితుడిగా ఉన్నావంటూ ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి నుంచి రూ. కోటి 58 లక్షల 47 వేలు సైబర్‌ నేరగాళ్లు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి ఆగస్టు 29వ తేదీన అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్‌ కాల్‌ వచ్చింది. కస్టమ్స్‌ డిపార్ట్‌మెంట్‌ నుండి కాల్‌ చేస్తున్నామని డ్రగ్స్‌ రవాణా, మనీలాండరింగ్‌ కేసులో మీ పేరు ఉందని, పేరు తీసేయాలంటే డబ్బులు ఇవ్వాలని భయపెట్టడంతో అతను అపరిచిత వ్యక్తి చెప్పిన విధాలుగా పలు దఫాలుగా రూ.కోటి 58 లక్షల 47 వేలు పంపాడు. ఇంకా డబ్బులు ఇవ్వాలయడంతో బాధితుడు ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి,అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహన దారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా,జడ్జి 10 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు తెలిపారు.

వరద నీటి సమస్య పరిష్కారం

ఆల్విన్‌కాలనీ: భారీ వర్షాల కారణంగా ఎల్లమ్మబండ పరిధిలోని గురుగోవింద్‌సింగ్‌ కాలనీలో వరద నీరు ఇళ్లలోకి వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకున్న డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ గురుగోవింద్‌సింగ్‌ కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. కాలనీ వెనుక వైపు పొంగుతున్న నీటిని జీహెచ్‌యంసీ సిబ్బందితో జేసీబీ యంత్రంతో ఓపెన్‌ నాలాలోకి వెళ్లే విధంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి వెనుక వైపు ఓపెన్‌ నాలాకు ప్రహరీ గోడ నిర్మిస్తే ఇళ్లల్లోకి నీరు రాకుండా ఉంటుందని ,ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.

'వికసిత్‌ భారత్‌'లో భాగస్వాములవ్వాలి

గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి


రాయదుర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వారితో కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: వికసిత్‌ భారత్‌ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి కోరారు. గచ్చిబౌలి డివిజన్‌ రాయదుర్గంలోని అంబేడ్కర్‌ కమ్యూనిటీహాల్‌లో డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ గచ్చిబౌలి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన సదస్సు

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ కంటి దినోత్సవం సందర్భంగా హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని పీఎస్‌ఆర్‌ ఎంపైర్‌ బిల్డింగ్‌లోని వాసన్‌ ఐ కేర్‌ హాస్పిటల్‌లో బుధవారం నేత్రదానంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా నేత్రదానం గొప్పదన్నారు. మరణానంతరం నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బ్రిక్‌ శ్రీనివాస్‌, రమేష్‌ పటేల్‌, డాక్టర్‌ రవికుమార్‌, డాక్టర్‌ కావ్యరెడ్డి, డాక్టర్‌ మయూరి బత్తుల, వాసన్‌ ఐ కేర్‌ రీజినల్‌ మేనేజర్‌ పి. ప్రసాద్‌, జీఎం నవీన్‌ పాల్గొన్నారు.


సదస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

మట్టి గణపతుల పంపిణీ..

బంజారాహిల్స్‌: వినాయకచవితిని పురస్కరించుకుని ప్రజలు మట్టి గణపతులను పూజించేలా ..హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా మట్టి గణపతుల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో బుధవారం గుర్తించిన ప్రాంతాల్లో మట్టి ప్రతిమల పంపిణీ చేపట్టారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పంపిణీ జరుగుతుందని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. లక్ష మట్టి విగ్రహాలు పంపిణీ చేయాలని హెచ్‌ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి రోజు బుధవారం అన్ని కేంద్రాల వద్ద మంచి స్పందన లభించింది. బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, పంజగుట్ట, సోమాజిగూడ, ఎన్టీఆర్‌ మార్గ్‌, ట్యాంక్‌బండ్‌ ప్రాంతాల్లో ఉచిత మట్టి గణనాథుల ప్రతిమల పంపిణీ కేంద్రాలను ఏర్పాటుచేసింది.

పంపిణీ కేంద్రాలివే..

- ఆరోగ్యశ్రీ సైలెంట్‌ వ్యాలీహిల్స్‌, జూబ్లీహిల్స్‌.. అధికారి రాజ్‌మోహన్‌: 99498 71088
- బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–10 ఐఏఎస్‌ క్వార్టర్స్‌, నరేష్‌ :8498984054
- బంజారాహిల్స్‌ కేబీఆర్‌ పార్కు మెయిన్‌గేటు, రవీందర్‌ : 91330 59867
- గ్రీన్‌ల్యాండ్స్‌ హిందూపేపర్‌ సమీపంలో, డి.విద్యాసాగర్‌: 96182 94411
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌, అషితోష్‌వర్మ :73311 85146
- జూబ్లీహిల్స్‌ పెద్దమ్మ దేవాలయం, గౌతమి : 88973 41954
- జూబ్లీహిల్స్‌ టూప్స్‌ రెస్టారెంట్‌, మీనాక్షి: 94406 81468
- అమీర్‌పేట మైత్రీవనం, ఆర్‌వై నాయుడు: 99893 36923
- సెక్రటేరియట్‌, గణేష్‌: 79893 71104
- ఎన్టీఆర్‌ గార్డెన్‌, నగేష్‌: 75694 55875
- మెల్కోటే పార్కు, నారాయణగూడ, అభిలాష్‌: 88854 85253
- మైండ్‌స్పేస్‌ జంక్షన్‌, మాదాపూర్‌, సంజయ్‌: 98499 09848
- కుందన్‌బాగ్‌,ఐఏఎస్‌కాలనీ, రామారావు–94410 15552

మట్టి గణపతినే పూజిద్దాం..


పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌ యాదవ్‌

గచ్చిబౌలి: మట్టి గణపతులను పూజిద్దామని చేవెళ్ల పార్లమెంట్‌ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆర్‌కేవై ఫౌండేషన్‌ ద్వారా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్లాస్టర్‌ ఆఫ్‌ ప్యారిస్‌ విగ్రహాలతో చెరువులు, భూగర్భ జలాలు కాలుష్యం బారిన పడే అవకాశం ఉందన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని ఎలక్ట్రికల్‌, అర్బన్‌ బయో డైవర్సిటీ అధికారులతో కలిసి కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభాయాత్ర జరిగే రూట్లలో ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్‌ అధికారులు దాసు, ఎలక్ట్రికల్‌ లైన్‌మెన్‌ సురేష్‌, ట్రాఫిక్‌, పోలీస్‌ అధికారులు, నాయకులు కుమారస్వామి, నిరంజన్‌గౌడ్‌, నిఖిల్‌, హమీద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న బండి రమేష్‌ తదితరులు

మోతీనగర్‌: వరద ముంపు బాధితుల కోసం కాంగ్రెస్‌ నాయకులు బ్లిస్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ పేర్కొన్నారు. వర్షాలకు అల్లాపూర్‌ డివిజన్‌ సఫ్దార్‌నగర్‌ ప్రాంతం ముంపునకు గురైందని తెలిపారు. కాలనీలు నీటిలో నానుతున్నాయని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌ మాట్లాడుతూ వరద బాధితులకు పార్టీ తరపున, ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, విఠల్‌రెడ్డి, నరసింహ, మస్తాన్‌రెడ్డి, నయిముద్దీన్‌, శివ చౌదరి, బచ్చు మల్లి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో టీచర్స్‌ డే


ప్రొ.డాక్టర్‌ వై రెడ్డి శ్యామలను సన్మానిస్తున్న అసోసియేషన్‌ సభ్యులు

శేరిలింగంపల్లి: సమాజంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా గౌరవింపబడే వృత్తి అధ్యాపక వృత్తి అని తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌ డాక్టర్‌ వై రెడ్డి శ్యామల అన్నారు. ఫ్రెండ్స్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో టీచర్స్‌ డేను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్యామల మాట్లాడుతూ అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు నడిపే వాడే గురువు అని అన్నారు. డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణ అసాధారణ ప్రజ్ఞాశాలి, విద్యావేత్త అని పేర్కొన్నారు. అనంతరం డిగ్రీ, జూనియర్‌ ప్రభుత్వ కళాశాలల లెక్చరర్స్‌, నవోదయ, గురుకుల స్కూల్స్‌, శేరిలింగంపల్లిలోని అన్ని స్కూల్‌ కాంప్లెక్స్‌ల పరిధిలో పనిచేసే 35 మంది ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. హెచ్‌ఎం రత్నప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త టి.రాఘవేందర్‌ రావు, అసోసియేషన్‌ ప్రతినిధులు వి.ఫణి కుమార్‌, అమ్మయ్య చౌదరి, వాణి సాంబశివరావు, జనార్దన్‌, పాలం శ్రీను, విశ్వశాంతి, విజయలక్ష్మీ, త్రివేణి, మమత తదితరులు పాల్గొన్నారు.

వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టాలి


చందానగర్‌ ఇంజనీరింగ్‌ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్‌ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన చందానగర్‌ సర్కిల్‌ ఇంజనీరింగ్‌ విభాగం అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా, వర్షానికి దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవసరమైన చోట ప్యాచ్‌ వర్క్‌లు చేపట్టాలని సూచించారు. ఈఈ ఈవీఎస్‌ రాజు, డీఈలు స్రవంతి, ప్రసాద్‌ పాల్గొన్నారు.

'మనూ'లో స్పాట్‌ అడ్మిషన్లకు ఏర్పాట్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్పాట్‌ అడ్మిషన్లకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు 'మనూ' అడ్మిషన్స్‌ డైరెక్టరేట్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వనజ తెలిపారు. యూనివర్సిటీలో మెరిట్‌ ఆధారంగా వివిధ పీజీ కోర్సులు, బీఈడీ, పాలిటిక్నిక్‌ కోర్సులో స్పాట్‌ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌ పోర్టల్‌ తెరిచామని..ఇది సెప్టెంబర్‌ 8వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసినా సీటు పొందని అభ్యర్థి కూడా అదే రిజిస్ట్రేషన్‌ ఐడీ ద్వారా కొత్త కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ చూడాలని ఆమె సూచించారు.

'ఎటర్నల్‌ విజ్‌డమ్‌'



రాయదుర్గం: 'ప్రపంచాన్ని మార్చడానికి మీరు ఉపయోగించే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య' అనే అంశంతో టీచర్లు విద్యయొక్క ప్రాధాన్యతను వివరిస్తూ రూపొందించిన 'ఎటర్నల్‌ విస్డమ్‌' చిహ్నం ఆకట్టుకుంటోంది. గోపన్‌పల్లిలోని రంగారెడ్డి జిల్లా జవహర్‌ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో ప్రధాన గేటు వద్ద ఈ చిహ్నం ఉంది. శిక్షణ కోసం వచ్చిన ఉపాధ్యాయులు ఈ చిహ్నం రూపకర్తలు. టిపి మణి(జేఎన్‌వి.. కసారాగాడ్‌), కె దేవదాస్‌ (జేఎన్‌వి.. కొల్లం),కె.ఎం సోమన్‌ (జేఎన్‌వి.. కాలికట్‌), ఎస్‌కే శేషేంద్రన్‌(జేఎన్‌వి.. ఇడుక్కి), వికెమహేషన్‌(జేఎన్‌వి.. మల్లాపురం), కెవిరాజేష్‌కుమార్‌ (జేఎన్‌వి.. పతానమ్‌తిట్ట), సాజికుమార్‌ (జేఎన్‌వి.. అలప్పాపుజా), ఎన్‌ వేణుగోపాలచారి (జేఎన్‌వి.. రంగారెడ్డి), విజయకుమారి (జేఎన్‌వి.. కొట్టాయం).